క్లుప్తంగా

సాహితీవేత్త అస్తమయం


రాములు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన సాహితీవేత్త కవి, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయులు అంకం రాములు(75) శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారు రచించిన 'నిర్మల్ జిల్లా చరిత్ర' గ్రంథం బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. పలు హిందీ ఆధ్యాత్మిక గ్రంథాలను తెలుగులోకి తర్జుమా చేశారు. ఆయన మృతి పట్ల జిల్లా కవులు, కళాకారులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.
సాహితీ రంగానికి రాములు చేసిన సేవలను తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు దామెర రాములు, అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, సలహా సభ్యులు డాక్టర్ తుమ్మల దేవరావు, పత్తి శివప్రసాద్ తదితరులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు రాములు మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కుంటాల: దళారి వ్యవస్థ నిర్మూలించి పంటకు మద్దతు ధర అందించేందుకు ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెంచికల్‌పాడ్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట హైదరాబాద్ చీఫ్ అకౌంటెంట్ అధికారి బాలకృష్ణ, కార్యదర్శి భోజేందర్ ఉన్నారు.

స్టడీ సర్కిల్ కోసం మంత్రి సీతక్కకు వినతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయం ఎదుట సర్వే నంబర్ 534లో ఉన్న ఖాళీ స్థలంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని.. నిరుద్యోగులకు ఉపయోగపడేలా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బత్తుల రంజిత్, కొంతం గణేశ్, రవి, నవీన్, సురేశ్, భూమేశ్, మురళి ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. కల్లూర్ రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుంటాల ఎంపీడీవో రహీం, లోకేశ్వరం ఎంపీడీవో సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

నేడు కుభీర్‌కు రాక

కుభీర్:మండల కేంద్రంలోని బాలాజీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో శనివారం ఉదయం 11 గంటలకు జరిగే బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార సభకు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు, మాజీ మంత్రి రామన్న, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ హాజరవుతారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు అనిల్, పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

సన్మానం

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన కథం అంకిత ఇటీవల ఇంటర్ ఎంపీసీలో 993 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈసందర్భంగా శుక్రవారం అరె మరాఠా సంఘం సభ్యులు విద్యార్థినిని సన్మానించారు. అరె మరాఠా భైంసా గౌరవ అధ్యక్షులు జాదవ్ పుండలిక్ రావ్ పటేల్, రఘువీర్ పటేల్, శివాజీ పటేల్, మాధవ్‌రావ్ పటేల్, మాజీ సర్పంచ్ మారుతి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

బోరిగాంలో..

తానూరు: మండలంలోని బోరిగాం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించారు. 10 జీపీఏ సాధించిన బి.ధనంజయ్ మండల టాపర్‌గా, 9.8 జీపీఏ సాధించిన సీహెచ్ దినేశ్, స్నేహలు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, శ్రీనివాస్, భోజారాం, నాయకులు చంద్రకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.

నీటి కష్టాలు తీరేదెన్నడు..?

కడెం: స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా.. నేటికి కడెం మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. తాగునీటికి, వాడకానికి నీరు లేకపోవడంతో జనం అరిగోస పడుతున్నారు. ఇంటింటికీ శుద్ధజలం అందించే మిషన్ భగీరథ పథకం ఇక్కడ మాత్రం జాడ లేదు. దీంతో సమీపంలోని వ్యవసాయ బావుల నుంచి ఎడ్లబండ్ల ద్వారా నీటిని ఇళ్లకు తెచ్చుకుంటున్నారు. భగీరథ జలం సరఫరా కాని గ్రామాల్లో బోర్లు వేసి పైపులైన్‌ను ట్యాంకుకు అనుసంధానించి ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉన్నా.. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి నీటి కష్టాలను దూరం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.


వ్యవసాయ బావి నుంచి ఎడ్లబండిలో ఉన్న డ్రమ్ములో నీటిని నింపుతున్న మిద్దెచింతవాసులు


ద్యాంగూడలో కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోర్


ద్యాంగూడలో అలంకారప్రాయంగా భగీరథ ట్యాంక్

- గిరిజన గూడేల్లో కానరాని భగీరథ జలం
- పనిచేయని చేతిపంపులు
- అరిగోస పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు

నీటి సమస్య ఉన్న గ్రామాలివే..

- ఉడుంపూర్ పంచాయతీలోని మిద్దెచింతలో తాగునీటికి ఒక చేతిపంపు ఉన్నప్పటికీ సరిగా పనిచేయడం లేదు. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని ఎండ్లబండ్ల ద్వారా ఇళ్లకు తెచ్చుకుంటున్నారు.
- పాండ్వపూర్ పంచాయతీ పరిధిలోని ద్యాంగూడ, కాసుగూడ గ్రామాల్లో 50 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడున్న ఏకైక చేతిపంపులోంచి నీరు మురికిగా వస్తుందని.. వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.
- చిట్యాల పంచాయతీలోని గోండుగూడలో భగీరథ పైపులైన్ ఉన్నప్పటికీ నల్లా నీటిని సరఫరా చేయడం లేదు. పాఠశాల వద్ద ఉన్న చేతిపంపే ఈ గ్రామానికి ఆధారం. ఇక్కడ కనీస అవసరాలకు నీరు ఉందని.. తాగునీటికి మాత్రం ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు.

నీళ్లు వస్తలేవ్..



బోరింగ్ నుంచి నీళ్లు మంచిగ రావు. మా ఊళ్లో అందరం బాయి నీళ్లే తాగుతం. నల్లా పైపులు పెట్టిన్రు కాని నీళ్లు వస్తలేవ్. మొన్న సార్లు వచ్చి బోరు ఏసి పోయిన్రు.. ఇప్పటివరకు నీళ్లు రాలేదు. నీళ్లు లేక గోసపడుతున్నాం. ఇప్పటికైనా సమస్య పరిష్కారం కావాలె.
– గంగుబాయి, ద్యాంగూడ

చర్యలు తీసుకుంటాం

మండలంలోని ద్యాంగూడ, కాసుగూడ, మిద్దెచింత గ్రామాలకు భగీరథ పైపులైన్ లేదు. ఐసోలేటెడ్ ఏరియా కావడంతో స్థానికంగా బోర్లు వేసి ట్యాంకులకు పైపులైన్ కనెక్షన్లు ఇచ్చి ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేయాలి. ద్యాంగూడలో వేసిన బోరు మట్టి పడి కూలిపోయింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మారుమూల గ్రామాలకు నీరు అందేలా చర్యలు తీసుకుంటాం.
– రమణ, డీఈ, మిషన్ భగీరథ

- బాబానాయక్ తండా పరిధిలోని గంగన్నపేటలో తాగునీటి కోసం జనం అల్లాడుతున్నారు. చేతిపంపు కూడా లేకపోవడంతో ఇక్కడున్న 30 కుటుంబాలు వ్యవసాయ బావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నాయి.
- అల్లంపల్లి పంచాయతీలోని పాలరేగడి గ్రామంలో ఉన్న 20 కుటుంబాలకు బావుల నీరే దిక్కు.

గూడేలకు అందని నీరు..

గ్రామాల్లోని పాతట్యాంకులకు రంగులు వేసి.. ఇంటింటికీ నల్లా నీటిని అందిస్తున్నామని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అధికారులు పర్యటించకపోవడం గిరిజన ప్రజలకు శాపంగా మారుతోంది. చిట్యాల్ పంచాయతీ పరిధిలోని గోండుగూడకు భగీరథ పైపులైన్ ఉన్నా.. నల్లా నీరు సరఫరా కావడం లేదు. ట్యాంకుకే నీళ్లు రాకుంటే ఇంటింటికీ ఎలా సరఫరా చేస్తామని సిబ్బంది పేర్కొంటున్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు చేసిందేం లేదు

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- గ్రామాల్లో బీజేపీ నాయకుల ప్రచారం

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిందేం లేదని.. ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీ అభ్యర్థి నగేశ్‌తో కలిసి లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్, బాబాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. నువడ్యాల్‌లో రోజుకు రూ.200 కూడా రావడం లేదని కూలీలు పేర్కొనగా ఎమ్మెల్యే వెంటనే ఏపీఎం ప్రమీలతో ఫోన్‌లో మాట్లాడారు. ఒక్కో కూలీకి రోజుకు రూ.200 వచ్చేలా చర్యలు తీసుకోవడంతోపాటు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్ రెడ్డి, అడ్వాల రమేశ్, రాంరెడ్డి, ముత్యం రెడ్డి, జీవన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: దేశం అభివృద్ధి చెందాలంటే కమలం గుర్తుకు ఓటేసి బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పంచగుడి, ధర్మోర, పిప్రి గ్రామాల్లో పని ప్రదేశాల వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో రాజేశ్ బాబు, మెండె శ్రీధర్, రవీందర్‌రావు, చిన్నారావు, సుమన్‌కుమార్, నారాయణ్‌రెడ్డి, భాస్కర్, మంద గణేశ్,గంగాధర్, రమేశ్, రాజశేఖర్ ఉన్నారు.


లక్ష్మణచాంద: వడ్యాల్‌లో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి, పక్కన అభ్యర్థి నగేశ్


లోకేశ్వరం: పిప్రిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

సోన్: మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో రావుల రాంనాథ్, వి.సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు. నగేశ్ గెలుపునకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. గంగన్న, హరీశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులున్నారు.

కుప్టిలో బీజేపీ నాయకుల ప్రచారం

కుభీర్: మండలంలోని కుప్టి గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎస్టీ సెల్ తాలుకా అధ్యక్షులు రాథోడ్ గులాబ్, పార్టీ మండలాధ్యక్షుడు దత్తాత్రి, డి.నాగేశ్ తదితరులు ఉన్నారు.


కుభీర్: కుప్టిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సారంగపూర్: మండలంలోని బోరిగాం తాజామాజీ సర్పంచ్ బీఆర్‌ఎస్‌ను వీడి శుక్రవారం మహేశ్వర్ రెడ్డి నివాసంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు, పలువురు బోరిగాం గ్రామస్తులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇంటి వద్ద ఓటేసిన దివ్యాంగులు, వృద్ధులు


కడెం: నవాబ్‌పేట్‌లో ఓటు వేయిస్తున్న సిబ్బంది


లోకేశ్వరం: బిలోలిలో ఓటు వేస్తున్న దివ్యాంగుడు

సారంగపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో శుక్రవారం దివ్యాంగులు, 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు ఓటుహక్కును తమ ఇళ్లలోనే వినియోగించుకున్నారు. స్థానిక బీఎల్‌ఓల సహకారంతో ఎన్నికల అధికారులు వారి ఇళ్లకు వెళ్లి వృద్ధులు, దివ్యాంగులతో ఓటు వేయించారు.

కడెం: ఎన్నికల సంఘం అవకాశం కల్పించడంతో మండలంలోని నవాబ్‌పేట్, అంబారిపేట్ గ్రామాల్లో ఎన్నికల అధికారులు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఓటు వేయించారు. జూనియర్ అసిస్టెంట్ ఫకీరా, బీఎల్‌వోలు సత్తవ్వ, రాజమణి ఉన్నారు.

లోకేశ్వరం: దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి వారు ఓటు వేసేలా చర్యలు తీసుకున్నామని లోకేశ్వరం పీవో ధర్మపురి అన్నారు. శుక్రవారం మండలంలోని పుస్పూర్‌లో తొమ్మిది మంది, నర్సింహనగర్ తండాలో ఇద్దరు, బిలోలిలో ముగ్గురు, కిష్టాపూర్‌లో ఇద్దరు ఓట్లు వేశారని పీవో పేర్కొన్నారు. ఏపీవో ప్రమోద్‌కుమార్, రవికాంత్, లస్మన్న ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

భైంసాటౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజుల్వార్ దిగంబర్ అన్నారు. పట్టణంలోని సుభద్రవాటిక శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో పది జీపీఏ సాధించారు. ఈమేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు మెమెంటోలు అందించి వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శైక్షనిక్ విభాగ్ ప్రముఖ్ వేణుమాధవ్, ప్రబంధకారిణి సభ్యులు రమేశ్ మాశెట్టివార్, శైలేశ్ మాశెట్టివార్, గంగయ్య, సాయినాథ్, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కడెం: మండలంలోని ఎలగడప గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు అబ్దుల్ రహీం, నాయకులు మహమ్మద్ సలీం, ఎంపీటీసీ రమేశ్, రాజేందర్, రియాజ్ తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని అర్లి, గొడిసెరా, సాథ్‌గాం గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు పండరిగౌడ్, సాయారెడ్డి, రత్నాకర్‌రావు, సంగెం నర్సయ్య, ఎల్లన్న, సుధాకర్, ముత్తగౌడ్, నర్సయ్య, భోజారెడ్డి ఉన్నారు.


లోకేశ్వరం: గొడిసెరాలో ప్రచారం చేస్తున్న నేతలు


లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో నేతల ప్రచారం

లక్ష్మణచాంద: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణను గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పార్‌పెల్లి, ధర్మారం, పీచర గ్రామాల్లో పని ప్రదేశాల వద్ద ఉపాధిహామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను వివరించారు. నాయకులు ప్రతాప్ రెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, నరేశ్‌రెడ్డి, నగేశ్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

సోన్: ఆదర్శ అమ్మ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని డీఈ తుకారం అన్నారు. శుక్రవారం మండలంలోని పాక్‌పట్ల ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ గుర్నాథం, ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, పాఠశాల కమిటీ చైర్మన్లు లక్ష్మీ, స్వప్న, రవికాంత్, గోపి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జగదాంబతండాలో పాఠశాలను సందర్శించి పనులను పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పంచాయితి కార్యదర్శులు ఉన్నారు.


పాక్‌పట్లలో మాట్లాడుతున్న డీఈ తుకారం

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్, గోసంపల్లె, పాతఎల్లాపూర్, ఒడ్డెవాడ, బావాపూర్(కే), కొత్తపేట్ ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ప్రత్యేకాధికారి బాబారావు, ఎంపీడీవో సునీత పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ఇతర పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, సీఆర్‌పీ వనిత, పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

జాతీయ సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్‌లో రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జే.భీమారావు మాట్లాడుతూ.. 'సుస్థిరాభివృద్ధిలో రసాయన శాస్త్రం–దాని అనుబంధ అంశాల పాత్ర' అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆర్థిక సహకారంతో నిర్వహించే ఈ సదస్సుకు విషయనిపుణులు, ప్రముఖులు హాజరవుతారని అన్నారు. సదస్సును నిర్మల్‌లో నిర్వహించేందుకు సహకరించిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రికి కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు కన్వీనర్ సరితరాణి, కోకన్వీనర్ రమాకాంత్‌గౌడ్ కళాశాల అధ్యాపకులు పీజీ.రెడ్డి, శంకర్, నరసయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న కన్వీనర్, అధ్యాపకులు

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: కాంగ్రెస్‌లో చేరి పార్టీ బలోపేతానికి కష్టపడే ప్రతి ఒక్కరికి గుర్తింపునిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని సుర్జాపూర్, బాదన్‌కుర్తి, ఎర్వచింతల్, గోసంపల్లె తదితర గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొజ్జు మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలో మార్నింగ్ వాక్ ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకుంటామన్నారు. నిర్మల్‌లో తలపెట్టిన రాహుల్ గాంధీ బహిరంగసభకు ప్రతీ బూత్ నుంచి 50 మంది చొప్పున పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. ఎంపీ అభ్యర్థి సుగుణకు ఖానాపూర్ నియోజకవర్గం నుంచి 25 వేల మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. అనంతరం తర్లపాడ్‌లో బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షులు రామిడి రమేశ్, సేవ్యానాయక్ తండాలో గోపినాయక్ ఆధ్వర్యంలో నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, మండల కార్యదర్శి షబ్బీర్‌పాషా తదితరులు ఉన్నారు.


వెంకాగౌడ్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్ జెడ్పీటీసీ ఆకుల రాజమణి భర్త వెంకాగౌడ్, బాదనకుర్తి మాజీ ఎంపీటీసీ గుడాల రాజన్న, ఎర్వచింతల్ మాజీ ఎంపీటీసీ బండారు రవీందర్, సుర్జాపూర్ మాజీ ఉపసర్పంచ్ సంగర్తి రాజన్న, పాతఎల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ కొడిమ్యాల వీరేశ్, నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాదరణతోనే బీఆర్‌ఎస్ విజయం

- మాజీ మంత్రి జోగు రామన్న

భైంసాటౌన్: ప్రజల్లో బీఆర్‌ఎస్‌కు ఉన్న ఆదరణే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపిస్తుందని మాజీ మంత్రి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందరోజుల్లో అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కొందరు పదేళ్లు అధికారం అనుభవించి పార్టీ వీడారని, కానీ, అసలైన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ.. ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. పార్టీ సభ్యత్వం కూడా లేని గోడం నాగేశ్‌కు ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు పి.రమాదేవి, విలాస్ గాదేవార్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్ పాల్గొన్నారు. పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా, రామన్నవ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.


మాట్లాడుతున్న పార్లమెంట్ ఇన్‌చార్జి రామన్న, పక్కన ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

మోసపూరిత హామీలను నమ్మవద్దు

ముధోల్: మోసపూరిత హామీలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీని నమ్మవద్దని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, రమాదేవి, లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్, కిరణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి యూనిస్ అక్బానీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, ప్రధాన కార్యదర్శి నజీరొద్దీన్, మహ్మద్ నయూం, అక్రం అలీ, మహ్మద్ బిన్ అలీ, శివాజీ, అనిల్, మసూద్‌ఖాన్, మహబూబ్ పాల్గొన్నారు.

పెంబి: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ మండల కేంద్రంలోని వారసంతలో ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, గోవింద్, విలాస్, పూర్ణచందర్‌గౌడ్, శంకర్ తదితరులు ఉన్నారు.

తానూరు: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని శుక్రవారం ఆ పార్టీ నాయకులు మండలంలోని ఎల్విలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, శివదాస్ పటేల్, గోపాల్ స్వామి, ఇస్మాయిల్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటేసిన ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: ఎన్నికల విధుల్లో పాల్గొనే మండలంలోని పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం జిల్లా కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899